# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 4-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:121 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

అల చిక్కడపల్లికి దో
మలగూడకు మధ్యనున్న మార్గములో సి
గ్నలు లేని లింకు బ్రిడ్జిని
వెలయించెను ప్రభుత ప్రజల విజ్ఞప్తులపై !!

(ప్రజలు కోరినందున చిక్కడపల్లి దోమలగూడ మధ్య సిగ్నల్లు లేని లింకు బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మించి ప్రారంభించింది. దీనివలన దూరం తగ్గి ప్రజలకు సమయం ఆదా అవుతుంది)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

కొత్తసాలు స్వాగతం
కోట్ల ఖర్చు అంబరం
చుక్క ముక్క చక్కర్లతో
చేసుకున్న సంబరం
దబ్బున్నా లేకున్నా
దాబుకొరకు జరుపడం
ఒక్కరోజు మురిపెంతో
ఒళ్లు మరిచి నెరుపడం



-వేల్పుల నారాయణ
9440433475

# అసెంబ్లీలో తేల్చుకుందాం రండి.. బీఆర్ఎస్ నేతలకు సీఎం సవాల్

హైదరాబాద్, జనవరి 3:బీఆర్ఎస్ నేతలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ంవశ్రీజీనిణజీనిజీ అఓ ఖీవలజీనిబిష్ట ఖీవటటఎ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభకు రాకుండా గులాబీ పార్టీ నేతలు తప్పించుకుతిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. బహిరంగ సభల్లో మాట్లాడటం కాదని.. సభకు రండి నిజాలు ఏంటో తేలుద్దామని సవాల్ విసిరారు. కృష్ణా నది జలాలపై చర్చ పెట్టమని తాము అడగలేదని ప్రస్తావించారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ అడిగారని చెప్పుకొచ్చారు. అందుకే అసెంబ్లీ పెట్టి కృష్ణా నది జలాలపై చర్చిస్తున్నామని స్పష్టం చేశారు. ఇవాళ(శనివారం) అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

కేసీఆర్ సభకు ఎందుకు రాలేదో కారణమే లేదని అన్నారు. హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశం స్పీకర్ ఇచ్చారని..అయినా తాము సభకు రామని వెళ్లిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని కోరారని..అయితే మీ బట్టలు ఊడదీస్తామని ఒకరు, తోలు తీస్తామని ఒకరు మాట్లాడారని.. ఇప్పుడేమో కుంటిసాకులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సభకు వచ్చి చర్చలో పాల్గొంటే ఎవరి బట్టలు ఎవరు ఊడదీయాలో ప్రజలు తేల్చేవారని అన్నారు. ప్రాజెక్టుల పై నిలదీస్తామన్న కేసీఆర్ సభకు రాలేదని చెప్పుకొచ్చారు.



సభకు వచ్చి ఆయన దగ్గర ఉన్న సమాచారం ఇస్తారనుకున్నామని కానీ అసెంబ్లీకి ఎందుకు రావట్లేదో తెలియదని అన్నారు.

కేసీఆర్ సూచనలు ఇస్తే తీసుకుందామని తాము అనుకున్నామని తెలిపారు. కృష్ణానీటిపై ఒకరోజు, గోదావరి నీటిపై మరోరోజు చర్చ పెడుదామనుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. రెండేళ్లుగా ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సభకు వచ్చి కేసీఆర్ అనుభవాలు తమతో పంచుకోవాలని తాను పదేపదే ఆయనను కోరుతున్నానని పేర్కొన్నారు. గతంలో మాజీ మంత్రి జానారెడ్డి, భట్టి విక్రమార్క పోషించిన పాత్ర పోషించమని కోరారని తెలిపారు. జానారెడ్డి, భట్టిలను ఆనాడు అవమానినించినా భరించి సభకు వచ్చి సలహాలు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు

## మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం.. మంత్రి పొంగులేటి

హైదరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం శాసనసభలో ఆయన మాట్లాడారు. సింగరేణి ప్రాంతాల్లో పట్టాల పంపిణీపై కేబినెట్ చర్చ జరిపారు. చెంచులు అందరికీ మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో 12, 500 ఇందిరమ్మ ఇళ్లు, గత ప్రభుత్వం కమీషన్ల కోణంలోనే ఇళ్లను పంపిణీ చేసిందని, తెలియజేశారు. ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ లు ఇళ్లకు నిధులు ఇస్తున్నామని, గత ప్రభుత్వం పింక్ కలర్ షర్ట్ ఉంటేనే ఇళ్లు ఇచ్చిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
# 12 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు.కిష్టారం అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 12 మంది మావోయి స్టులు మృతిచెందారు. మృతిచెందిన వారిలో కుంట ఏరియా కార్యదర్శి మంగడు మృతిచెంది నట్లు తెలిసింది. ఘటనాస్థలిలో ఏకే 47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు.

# ఏపీలో భారీ అగ్నిప్రమాదం..

అనకాపల్లి, జనవరి 3 : ఏపీలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈఘటన అచ్యుతాపురం సెజ్‌లోని రాంబిల్లి మండలం ఎస్‌విఎస్ ఫార్మా కంపెనీలో ఇవాళ (శనివారం) సంభవించింది. సదరు కంపెనీ ఆవరణలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మంటలు వేగంగా వ్యాపించడంతో, అక్కడి స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు.

సమాచారం అందగానే అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ సేఫ్టీ సిబ్బంది క్రమంగా ప్రయత్నిస్తున్నారు. మంటల ప్రభావం దృష్ట్యా స్థానికుల భద్రత పరంగా దూరంగా పంపించారు. ఈ ప్రమాదాన్ని నియంత్రణలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు.

మరోవైపు.. ఈ అగ్నిప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించారు. మంటల పరిస్థితి, కంపెనీ సిబ్బంది, స్థానికుల భద్రత గురించి పర్యవేక్షణ కోసం అనకాపల్లి కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మంటలను తక్షణమే అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ పరిస్థితిని సురక్షితంగా నియంత్రిస్తున్నామని అధికారులు వెల్లడించారు. అగ్నిప్రమాదం నిర్వహణలో ఫైర్ సేఫ్టీ, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు జారీ చేశారు.

# అందెశ్రీ కుటుంబానికి ప్రభుత్వం అండ..
## -అసెంబ్లీలో ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టిన భట్టి

హైదరాబాద్, జనవరి 3: తెలంగాణ ప్రభుత్వం (ంవశ్రీజీనిణజీనిజీ ఉనీలవతీనిఎవనిబి) మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ కవి అందెశ్రీ కుటుంబానికి అండగా నిలవాలని భావించింది. ఇందులో భాగంగా అందెశ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడానికి వీలుగా 1994 ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, వేతన నిర్మాణ చట్ట సవరణ బిల్లును రాష్ట్ర శాసన సభలో ఇవాళ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సభలో మాట్లాడారు. అందె శ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.

ఇందుకోసం చట్టపరమైన మద్దతు అవసరమని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో 1994పబ్లిక్ సర్వీస్ కమిషన్ చట్టంలోని నిబంధనలు సవరించాల్సి ఉందని తెలిపారు. అందె శ్రీ కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించడం కోసం చేసిన సవరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టామని వెల్లడించారు. 1994 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం 7991 మంది తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని తెలిపారు. అందులో కొందరు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి గతం నుంచి రెగ్యులరైజ్ చేయాలని ఆర్డర్ తెచ్చారని ప్రస్తావించారు మల్లు భట్టి విక్రమార్క.

గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు 573/225, 1.1.1995కి ఇది విరుద్ధమని చెప్పుకొచ్చారు. వెనుక తేదీ నుంచి



రెగ్యులరైజ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై రూ.20వేల కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. ఏపీలో ఇలాంటి సమస్య వచ్చినప్పుడు ప్రాస్పెక్టివ్‌గా చట్ట సవరణ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం 25.11.2025న ప్రాస్పెక్టివ్ రెగ్యులరైజేషన్ కోసం ఆర్డినెన్స్ 88 తెచ్చిందని తెలిపారు. ఈ ఆర్డినెన్సును బిల్ నంబర్ 7ద్వారా సభ ఆమోదం కోరుతున్నామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఒక్క నీటి చుక్కనూ వదలం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 3: తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు.

పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉనన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు. అయితే కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక్క టీఎంసీ కూడా అదనంగా పెంచారని.. అదే సమయంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో టీఎంసీలను తగ్గించారని మండిపడ్డారు.

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా నదీ జలాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు త్వరలో వెలువడనుందని మంత్రి తెలిపారు. తాను స్వయంగా ట్రిబ్యునల్ వాదనలకు హాజరవుతున్నానని, కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 72 శాతం వరకు నీటి కేటాయింపులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తెలంగాణకు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మొత్తం 814 టీఎంసీల కృష్ణా నీళ్లను తెలంగాణ, ఏపీకి న్యాయంగా కేటాయిం చాల న్నారు. తెలంగాణకు కృష్ణా నది లో 72 శాతం వాటా కావాలని వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కేటాయించిన 45 టీఎంసీల నీళ్లనే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ గోబెల్స్ ప్రచారాన్ని కూడా మించిపోయిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2016లో అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి కేసీఆర్ హాజరై 299 టీఎంసీలకు ఒప్పుకున్నారని.. తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 511 టీఎంసీల నీటి కేటాయింపులపై ఒప్పందాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణకు 71 శాతం, ఏపీకి 29 శాతం కృష్ణా నీటి వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ సమాధానం చెప్పాల్సిందే: మంత్రి శ్రీధర్**

ఈ చర్చలో మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొని మాట్లాడుతూ.. నదీ జలాల విషయంలో తెలంగాణ హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చించేందుకే సభలో లఘు చర్చను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇలాంటి కీలకమైన అంశంపై బీఆర్ఎస్ సభకు హాజరుకాకపోవడం సరైనది కాదని వ్యాఖ్యానించారు. నదీ జలాల అంశంపై ప్రజలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పాలని శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు.

# గృహ జ్యోతి పథకంపై సభలో డిప్యూటీ సీఎం భట్టి క్లారిటీ


హైదరాబాద్, జనవరి 3:తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు.

పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవించడమే ప్రభుత్వ లక్ష్యమని తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ గృహ జ్యోతి వర్తిస్తుందన్నారు. కొత్త దరఖాస్తులు, మార్పులు చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 52.82 లక్షల కుటుంబాలకు గృహ జ్యోతి ద్వారా ఉచిత విద్యుత్ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. గృహ జ్యోతి కోసం ఇప్పటి వరకు రూ.3,593 కోట్లకు పైగా ప్రభుత్వం చెల్లింపులు చేసిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

వ్యవసాయం రంగంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానిమిస్తూ.. వ్యవసాయ రంగంలో ఆగిన పథకాలను పునరుద్ధరణ చేపడుతున్నామని చెప్పారు. సోయాను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసినా, కేంద్రం కొనడం లేదని అన్నారు. ఈ విషయంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్రంపై ఒత్తిడి తేవాలని మంత్రి సూచించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు.


ఆహ్వానం






వంశీ - సుధా రామరాజు విజ్ఞాన పీఠం
ఆధ్వర్యంలో
ప్రముఖ రచయిత్రి
శ్రీమతి తురగా (మోచర్ల) జయశ్యామల రచన
వంశీ స్వర్ణోత్సవ 28వ ప్రచురణ
పూర్ణిమ నవలపై సమీక్ష
07-01-2026 బుధవారం, సా॥ 4:30 గం॥లకు,
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్.
సభా కార్యక్రమం : సా॥ 6 నుండి 9 వరకు
ముఖ్యఅతిథి
ఆచార్య ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
పూర్వ వైస్ ఛాన్సలర్, తెలుగు విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు
శ్రీ జి. వల్లీశ్వర్
పాత్రికేయులు, రచయిత
సభ్యులు, నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా
ప్రధాన వక్తలు
సాహితీ సామ్రాజ్ఞి శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి
శ్రీమతి కె. సర్వమంగళ గౌరీ, సివిల్ సర్వీస్ శిక్షణ నిపుణురాలు
ఆత్మీయ అతిథి
శ్రీమతి జ్యోతి వలబోజు
జె.వి. పబ్లికేషన్స్ అధినేత్రి
కార్యక్రమ నిర్వహణ:
కళాబ్రహ్మ, శిరోమణి డా॥ వంశీ రామరాజు
వ్యవస్థాపకులు, వంశీ సంస్థలు
శైలజ సుంకరపల్లి
మేనేజింగ్ ట్రస్టీ, వంశీ
ఈ కార్యక్రమాన్ని ... ద్వారా వీక్షించవచ్చు
సాయంత్రం 4:30 నుండి 6 గంటల వరకు
అంతర్జాతీయ గాయకులు
శ్రీ వై.ఎస్.రామకృష్ణ బృందంచే
సినీ సంగీత విభావరి
వ్యాఖ్యానం
వ్యాఖ్యానశిరోమణి
సుధామయి


# తెలంగాణలో అభివృద్ధి జాడేది..కవిత ఫైర్



సూర్యాపేట, జనవరి3 : తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత.

సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీవీబీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత.రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళు రాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా అని ఫైర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళు ఇచ్చే డిస్ట్రిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.

# దృష్టి దోషం ఉన్న అభాగ్యులను అక్కున చేర్చుకోలేమా !

## (04 జనవరి "ప్రపంచ బ్రెయిలీ దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఒక బిలియన్ అంగవైకల్యం ఉన్న అభాగ్యుల ఉన్నారు. వీరిలో దృష్టి లోపం లేదా దోషం ఉన్న వారు జీవితాంతం చీకటిలో బతుకుతూ, పౌర సమాజానికి దూరంగా, పరిమిత కదలికలతో దుర్భర జీవితాలను గడుపుతున్నారు. అంధులు ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగ ఉపాధులు, విద్యాభ్యాసం లాంటి కనీస అవసరాలకు దూరంగా బతుకులను ఈడుస్తున్నారు. అంధుల్లో అధిక శాతం పేదరికం, హింస, నిర్లక్ష్యం, దుర్వినియోగం, స్వేచ్ఛ, ఒంటరితనం, పరిమిత సమాచారం, మానవ హక్కుల ఉల్లంఘనలను నిత్యం అనుభవిస్తున్న వారే అధికంగా ఉండడం విచారకరం. దృష్టి దోషంతో బాధపడుతున్న వర్గాల సమస్యలను అర్థం చేసుకోవడం, వారి అభ్యున్నతికి కృషి చేయడం, విద్యావకాశాలు కల్పించడం, ఉద్యోగ ఉపాధుల్లో వారికి పెద్ద పీట వేయడం లాంటి లక్ష్యాలను అధిగమించడంతో ఆ వర్గాలకు బ్రెయిలీ లిపి ఒక అద్భుత వరంగా మారడంతో ప్రతి ఏట 04 జనవరిన ప్రపంచ మానవాళి "ప్రపంచ బ్రెయిలీ దినం" ఘనంగా నిర్వహిస్తున్నది. బ్రెయిలీ లిపిని కనుగొన్న అంధ మేధావి "లూయిస్ బ్రెయిలీ" పుట్టిన రోజు సందర్భంగా ఈ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది.

### బ్రెయిలీ భాష అంటే ఏమిటి ?

అక్షరాలు, అంకెలు, లెక్కలు, సంగీత సంకేతాలు, శాస్త్రీయ సంకేతాలను సూచించడానికి పేపరుపై ఆరు చుక్కలతో రాసిన విలక్షణ లిపిని ఇతర అంధులు తమ చేతి స్పర్శతో చదువుకోగల ప్రత్యేక లిపిని "బ్రెయిలీ భాష" అని పిలుస్తున్నాం. 19వ శతాబ్దంలో లూయిస్ బ్రెయిలీ తన 11వ ఏటనే ప్రారంభించిన బ్రెయిలీ లిపిని తొమ్మిదేళ్లు శ్రమించి ఒక నిర్దిష్ట రూపం ఇవ్వడం జరిగినా తను చనిపోయిన తర్వాత మాత్రమే ఈ లిపికి బహుళ ఆదరణ లభించడం ప్రారంభమైనది. పూర్తి, పాక్షిక అంధులకు అపురూప వరంగా నిలుస్తున్న బ్రెయిలీ లిపిని ఉపయోగించుకున్న అంధులు తమ విద్య, విజ్ఞానం, భావ ప్రకటన స్వేచ్ఛ, అభిప్రాయాల వితరణ, ఉద్యోగ ఉపాధులు, సామాజిక సమ్మిళిత అంశాల్లో ముందుకు సాగడం హర్షదాయకం. 04 జనవరి 1809న జన్మించిన లూయిస్ బ్రెయిలీ తన 3వ ఏట జరిగిన ప్రమాదంలో దురదృష్టవశాత్తు దృష్టిని కోల్పోయినప్పటికీ పాఠశాల విద్యను చురుకుగా కొనసాగిస్తూనే అంధులకు ఉపయుక్తం అయ్యే విధంగా ప్రత్యేక లిపిని రూపొందించడం ప్రారంభించారు. అంధులు చదవడం, రాయడానికి ఉపయోగపడుతున్న బ్రెయిలీ లిపి నేటి అంధుల పాఠశాలల ఉపాధ్యాయులకు, అంధ విద్యార్థులకు, తల్లితండ్రులకు, సంరక్షకులకు, శాస్త్ర సాంకేతిక నిపుణులకు ఒక సవాలుగా నిలుస్తున్నది.

### బ్రెయిలీ ఒక లిపి మాత్రమే కాదు, అంధులకు చూపునిచ్చే అక్షర నేత్రం:

నేడు ప్రపంచవ్యాప్త అంధ వర్గాలకు అద్వితీయ వరంగా మారిన బ్రెయిలీ లిపి నేడు విశ్వవ్యాప్త విద్యాలయాల్లో బోధనలకు ఉపయోగపడడం, వారి అభ్యున్నతికి బాటలు వేయడం, అంధుల చీకటి బతుకుల్లో వెలుగులు నింపడం జరుగుతోంది. లూయిస్ బ్రెయిలీ కనుగొన్న ఈ ప్రత్యేక లిపిని "బ్రెయిలీ భాష లేదా లిపి"గా పిలుచుకోవడం సముచితంగానే కాకుండా బ్రెయిలీ చేసిన కృషికి విలక్షణ గుర్తింపుగా నిలుస్తున్నది. బ్రెయిలీ లిపిని ఆసరాగా చేసుకొని అంధులు పేదరికంలోంచి బయట పడడం, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయడం, మానవ హక్కులను అనుభవించడం, మేధావులుగా నిలవడం, ఉద్యోగ ఉపాధులు పొందడం నిరంతరం కొనసాగాలని కోరుకుందాం. 2026 ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ ఇతివృత్తంగా "అంధులు, దృష్టిదోషం ఉన్న అభాగ్యులను అక్కున చేర్చుకుందాం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

అంధుల సాధికారతకు పెద్ద పేట వేస్తూ బ్రెయిలీ లిపి చుక్కలతో వారి ముఖాల్లో ఆనందభాష్పాలను దర్శిద్దాం. బ్రెయిలీ జీవితం అంధులకే కాకుండా చూపుగల మనందరికి కూడా దారి దీపం కావాలి, మనకు నిత్య ప్రేరణగా నిలవాలి.

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# పర్యావరణాన్ని పరిరక్షించడం కూడా ఒక రకమైన దైవిక సేవ - ఉపరాష్ట్రపతి



న్యూ ఢిల్లీ, జనవరి 3: భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు తమిళనాడులోని వెల్లూరులోని శ్రీపురంలో జరిగిన శ్రీ శక్తి అమ్మ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీ శక్తి అమ్మ ఆధ్యాత్మిక ప్రయాణం 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం పట్ల తన అపారమైన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

భారత మాజీ రాష్ట్రపతులు డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం మరియు శ్రీ రామ్ నాథ్ కోవింద్, ఇటీవల భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము గత నెలలో ఆలయాన్ని సందర్శించిన సందర్శనలలో శ్రీపురం స్వర్ణ దేవాలయం పవిత్రత మరియు ఆధ్యాత్మిక ఔన్నత్యం ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు.

శ్రీ శక్తి అమ్మ ధర్మం పట్ల నిబద్ధతను నొక్కి చెబుతూ, ఆయన మార్గదర్శకత్వం ఆధ్యాత్మికతకు మించి సమగ్ర సామాజిక సేవకు విస్తరించిందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి దీర్ఘకాలిక కార్యక్రమాలు, వేలాది మందికి ఆహారాన్ని అందించే రోజువారీ అన్నదానం కార్యక్రమం వంటి శ్రీపురంలో చేపట్టిన విస్తృత శ్రేణి ధార్మిక కార్యకలాపాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమాలను నిజమైన భక్తి స్ఫూర్తితో అందించే గొప్ప సేవలుగా ఆయన అభివర్ణించారు.

శ్రీపురం ప్రాంగణంలో 50,000 కి పైగా చెట్లను నాటామని, సమీపంలోని కైలాసగిరి కొండలపై లక్షల మొక్కలు నాటామని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. దీనిని ఆయన భూమి తల్లికి, మానవాళికి ఒక గొప్ప సహకారంగా, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు బలమైన బలాన్నిచ్చారని ఆయన అభివర్ణించారు. పర్యావరణాన్ని రక్షించడం అనేది దైవిక సేవ యొక్క ఒక రూపం అని ఆయన అన్నారు.

నిజమైన ఆధ్యాత్మికత కేవలం ఆచార ఆరాధనలో మాత్రమే కాకుండా, ప్రేమ, కరుణ మరియు తోటి మానవులకు సేవ చేయడంలో కూడా ఉందని నొక్కి చెబుతూ, "ప్రేమ కంటే గొప్ప తపస్సు మరొకటి లేదు" అని కవి సుబ్రమణ్య భారతి చెప్పిన మాటలను ఉపరాష్ట్రపతి ఉదహరించారు. సమాజాన్ని ప్రేమించడం మరియు సేవ చేయడం అనేది ఆధ్యాత్మిక క్రమశిక్షణ యొక్క అత్యున్నత రూపం అని ఆయన గమనించారు.

శ్రీ శక్తి అమ్మను ప్రస్తుత యుగానికి గొప్ప ఆధ్యాత్మిక జ్యోతిగా అభివర్ణించారు, ఆమె తన జీవితం మరియు చర్యల ద్వారా "ప్రేమ దైవికం" అనే సూత్రాన్ని ఉదహరించి, సమాజం అంతటా నీతిని మరియు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించింది.

అంతకుముందు, ఉపరాష్ట్రపతి తమిళనాడులోని వెల్లూరులోని శ్రీపురంలోని శ్రీ నారాయణి ఆలయంలో దర్శనం చేసుకున్నారు. అందరికీ శాంతి, శ్రేయస్సు మరియు ఆనందం కోసం ఆయన లక్ష్మీ దేవిని ప్రార్థించారు.

# ఎస్పీ ఆత్మహత్యాయత్నం

కర్ణాటక, జనవరి 3: కర్ణాటకలోని బళ్లారి నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు వివాదం ఘర్షణకు దారితీసి కాల్పులతో రణరంగంగా మారిన సంఘటన రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపింది.

కర్ణాటకలోని బళ్లారిలో గాలి జనార్దన్ రెడ్డి తో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి వర్గీయుల మధ్య జరిగిన గొడవలు చివరికి ఎస్పీ ఆత్మహత్యా యత్నానికి కారణమైంది. ఈ ఘటన జరిగిన సమయానికే సరిగ్గా కొన్ని గంటల ముందు పవన్ నజ్జూర్ బళ్లారి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

అయితే, నగరంలో పరిస్థితిని అదుపు చేయడంలో వైఫల్యం చెందారని, ఉన్నతాధికారులకు సరైన సమాచారం చేరవేయలేదనే ఆరోపణలతో కర్ణాటక ప్రభుత్వం ఆయనను వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

సస్పెన్షన్ వేటు పడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఎస్పీ పవన్ నజ్జూర్ ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు వార్తలు వెలువడ్డాయి. తుమకూరు జిల్లా శిరా తాలూకాలోని తన ఫామ్ హౌస్‌లో నిద్ర మాత్రలు మింగి ఆయన ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు సమాచారం

# ప్రధాన ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకపోతే సభకు ఎందుకు రావాలి...

## – సభాపతి వైఖరికి నిరసనగా సమావేశాల బహిష్కరణ
## – బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ జనవరి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ).: సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు, సభాపతి వైఖరికి నిరసనగా సమావేశాల బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నామని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వచ్చామని అన్నారు. ఈ సందర్భంగా గన్ పార్కు వద్ద హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చారని, బిఎసిలో నిర్ణయాలు ఒకటైతే.. సభలో పెట్టింది మరొకటి అని తెలియజేశారు. ముఖ్యమంత్రి సభను బూతుల మయం చేశారని, సిఎం వ్యాఖ్యలపై నిరసనకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకపోతే సభకు ఎందుకు రావాలి? అని.. ముఖ్యమంత్రిని విమర్శించవద్దని స్పీకర్ ఎలా అంటారు? అని ప్రశ్నించారు. మూసీ కంటే ముందు సిఎం నోరు ప్రక్షాళన చేయాలని, అసెంబ్లీని సిఎం గాంధీభవన్, సిఎల్పి భేటీలా మారుస్తున్నారని మండిపడ్డారు. తాము ప్రశ్నిస్తే సిఎం అడ్డుగోలుగా మాట్లాడుతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. సిఎం మాట్లాడిన అనంతరం మాట్లాడే అవకాశం ఇవ్వట్లేదని బిఆర్ఎస్ వాకౌట్ చేశారు. బిఆర్ఎస్ నిరసన గన్ పార్కు వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు బైఠాయించారు. సభాపతి పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని బిఆర్ఎస్ సభ్యులు నినాదాలు, అసెంబ్లీ నుంచి గన్ పార్క్ వద్దకు వెళ్లి బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన చేశారు. బిల్లులపై చర్చకు దూరంగా ఉండాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిర్ణయం తీసుకున్నారు.

# బలహీనతలు తగ్గించుకుంటూ బలాలను పెంచుకోవడమే వ్యక్తిత్వ వికాసం

## – ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు



హైదరాబాద్, జనవరి 3:ప్రతి విద్యార్థి తనలో దాగిన బలహీనతలను తెలుసుకొంటూ, వాటిని తగ్గించుకునే ప్రయత్నం చేయడంతో పాటు మనలోని బలాలను పెంచుకుంటూ ఎదగడమే వ్యక్తిత్వ వికాసమని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు నగ్గునూర్ సమీప ప్రభుత్వ సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి ఫూలే జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, మహిళల గౌరవం పెంచే ఏకైక ఆయుధం ఉన్నత విద్య మాత్రమే అని, తమ కాళ్లపై తాము నిలబడిన రోజు లింగ సమానత్వం సుసాధ్యం అవుతుందని అన్నారు. నేటి యువతులకు సావిత్రిబాయి ఫూలే జీవితం స్ఫూర్తిదాయకంగా నిలవాలని, అన్ని ప్రతీకల్లా మధ్య ఆ వనిత చూపిన తెగువ అనుసరణీయమని తెలిపారు. నేటి డిజిటల్ ఏఐ యుగంలో విద్యతో పాటు ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, నైపుణ్య సంపద ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని అన్నారు. క్రమశిక్షణ, ఏకాగ్రత, లక్ష్యంపై దృష్టి ఉన్న యువతకు అనంత అవకాశాలు ఉన్నాయని అన్నారు. మనల్ని వేధిస్తున్న పేదరికాన్ని రూపుమాపేందుకు విద్య అనే సాధనం అవసరమని పేర్కొన్నారు. మంచి అలవాట్లతో ఆకర్షణీయ గుణగణాలు అలవడతాయని, మంచి గుణగణాలతో ఉన్నత శిఖరం చేరవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా లయన్ ఇనుగుర్తి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశలో విజ్ఞాన సమపార్జన చేయాలని, ఉద్యోగ ఉపాధి దొరికిన తర్వాత లయన్స్ క్లబ్ లాంటి సంస్థలో చేరి సమాజానికి తమ వంతు సేవలను చేయాలని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డా మాలతీ మాట్లాడుతూ నేటి యువతలో గురువులపై గౌరవం, నైతిక విలువలు సన్నగిల్లడం విచారకరమని తెలిపారు. ఈ సందర్భంగా ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి తమ స్వంత లైబ్రరీలోని పలు రసాయనశాస్త్ర పుస్తకాలు, తాను రచించిన పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి అందించారు. సావిత్రిబాయి ఫూలే జయంతి సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ , వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాల మహిళా అధ్యాపకులను లీడ్ ఇండియా-2047, శాతవాహన లయన్స్ క్లబ్ పక్షాన సముచితంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి, గౌరవ అతిథులను కళాశాల ప్రిన్సిపాల్ ఘనంగా సన్మానించారు. చివరి అంశంగా ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి పాడిన భక్తి గీతం విద్యార్థినుల కరతాళధ్వనుల ఆకట్టుకుంది.

# భగవాన్ బుద్ధుడు చూపిన జ్ఞానం మరియు మార్గం మానవాళి అందరికీ చెందుతుంది: ప్రధాని

న్యూ ఢిల్లీ, జనవరి 3:న్యూ ఢిల్లీలోని రాయ్ పిథోరా సాంస్కృతిక సముదాయంలో ఈరోజు "ది లైట్ ఎ ది లోటస్: రిలిక్స్ ఆఫ్ ది అవేకెన్డ్ వన్" అనే పేరుతో భగవాన్ బుద్ధునికి సంబంధించిన పవిత్ర పిప్రహ్వా అవశేషాల గ్రాండ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజిషన్‌ను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, నూట ఇరవై ఐదు సంవత్సరాల నిరీక్షణ తర్వాత, భారతదేశ వారసత్వం తిరిగి వచ్చిందని, భారతదేశ వారసత్వం తిరిగి వచ్చిందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. నేటి నుండి భారత ప్రజలు బుద్ధుని ఈ పవిత్ర అవశేషాలను వీక్షించగలరని మరియు ఆయన ఆశీర్వాదాలను పొందగలరని ఆయన హైలైట్ చేశారు. ఈ శుభ సందర్భంగా హాజరైన అతిథులందరికీ శ్రీ మోదీ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బౌద్ధ సంప్రదాయంతో సంబంధం ఉన్న సన్యాసులు మరియు ధర్మ ఆచార్యులు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు మరియు వారి పట్ల తన భక్తిని వ్యక్తం చేశారు. వారి ఉనికి ఈ కార్యక్రమానికి కొత్త శక్తిని ఇస్తుందని ఆయన నొక్కి చెప్పా రు. 2026 ప్రారంభంలోనే, ఈ శుభ వేడుక అత్యంత స్ఫూర్తి దాయకమైనదని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. బుద్ధుని ఆశీర్వా దాలతో, 2026 సంవత్సరం ప్రపంచానికి శాంతి, శ్రేయస్సు మరియు సామరస్యంతో కూడిన కొత్త యుగానికి నాంది పలకాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన ప్రదేశం ప్రత్యేకమైనదని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. ఖిలా రాయ్ పిథోరా ప్రదేశం భారత దేశపు అద్భుతమైన చరిత్ర కలిగిన ప్రదేశం అని, దాదాపు వెయ్యి సం వత్సరాల క్రితం పూర్వ పాలకులు బలమైన మరియు సురక్షితమైన గోడలతో చుట్టుముట్టబడిన నగరాన్ని స్థాపించారని ఆయన హైలైట్ చేశారు. నేడు అదే చారిత్రాత్మక నగర సముదాయంలో, చరిత్రలో ఒక ఆధ్యాత్మిక మరియు పవిత్ర అధ్యాయం జోడించబడుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఇక్కడికి రాకముందు తాను ఈ చారిత్రాత్మక ప్రదర్శనను వివరంగా గమనించానని శ్రీ మో దీ పేర్కొన్నారు. బుద్ధుని పవిత్ర అవశేషాలు మన మధ్య ఉండటం అందరినీ ఆశీర్వదిస్తుందని ఆయన నొక్కి చెప్పారు. భారత దేశం నుండి వారు నిష్క్రమించడం మరియు చివరికి తిరిగి రావడం రెండూ తమలో తాము ముఖ్యమైన పాఠాలు అని ఆయన గుర్తించారు. బానిసత్వం రాజకీయ మరియు ఆర్థికంగా మాత్రమే కాకుండా, మన వారసత్వాన్ని కూడా నాశనం చేస్తుందని పాఠం అని నొక్కిచెప్పిన శ్రీ మోదీ, బానిసత్వ కాలంలో తీసుకెళ్లబడిన బుద్ధుని పవిత్ర అవశేషాల విషయంలో కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. వాటిని తీసుకెళ్లిన వారికి మరియు వారి వారసులకు, ఈ అవశేషాలు కేవలం నిర్జీవమైన పురాతన వస్తువులు అని ఆయన ఎత్తి చూపారు. అందుకే వారు ఈ పవిత్ర అవశేషాలను అంతర్జాతీయ మార్కెట్లో వేలం వేయడానికి ప్రయత్నించారని ఆయన అన్నారు.

# కేక్ కటింగ్.. ఆత్మీయ పలకరింపు

## – పిల్లలతో న్యూ ఇయర్ సంబరాలు
## –పిల్లల ఆనందాన్ని పంచుకున్న నగర పోలీస్ కమిషనర్
## –పోలీస్ కార్యాలయంలో వెల్లివిరిసిన మానవీయత

విజయవాడ, జనవరి 3: నూతన సంవత్సరం అంటే సంబరాలు, కేక్‌లు, శుభాకాంక్షలు మాత్రమే కాదు. కొంతమందికి అది ఆత్మీయ స్పర్శ, మానవీయ అనుభూతి కూడా. అలాంటి అనుభూతిని 2026 తొలి రోజుల్లోనే మానసిక వికాస కేంద్రం పిల్లలకు అందించారు నగర పోలీస్ కమిషనర్ ఎన్‌వి రాజశేఖర బాబు.

కమిషనర్ కార్యాలయం శనివారం అధికారిక వాతావరణాన్ని వదిలి, పిల్లల నవ్వులతో, చప్పట్లతో, అమాయక ఆనందంతో నిండిపోయింది. పిల్లలతో కలిసి కేక్ కట్ చేసిన కమిషనర్, వారితో సరదాగా మాట్లాడుతూ వారి ముఖాల్లో చిరునవ్వులు పూయించారు.

చిన్న చిన్న మాటలు, స్నేహపూర్వక ఆత్మీయత ఆ క్షణాల్లో పోలీస్ అధికారి కాదు, ఒక పెద్ద మనసున్న మిత్రుడిగా మారిపోయారు. చివరగా పిల్లలకు చాక్లెట్లు అందిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్యం

## –ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్
## –కదిరిలో రైతు అంగడి ప్రారంభం

శ్రీ సత్యసాయి జనవరి 3: చిరుధాన్యాలతో తయారయ్యే వంటకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలో రాయలసీమ ప్రాంతీయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అంగడి కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం రైతుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో కీలకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు అంగడిలో అందుబాటులో ఉన్న చిరుధాన్యాలకు సంబంధించిన బియ్యాలు, ఇడ్లీ, ఉప్మా రవ్వలు, వేరుసెనగ విత్తనాలు, నూనెలు, చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, దేశీయ రకాల వరి బియ్యాలను పరిశీలించారు. రైతు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వాటి మార్కెట్ అమ్మకాలు, వినియోగదారుల ఆదరణపై వివరాలు తెలుసుకున్నారు. చిరుధాన్యాలకు కేవలం మార్కెట్ మాత్రవే కాకుండా కుటుంబ స్థాయిలో వినియోగం కూడా పెరగాలని సూచించారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం కలిసి సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘాలు కార్పొరేట్ స్థాయిలో ఆలోచిస్తూ ముందుకు సాగడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. వినియోగదారుల కొనుగోళ్లను పెంచేవిధంగా రైతు సంఘాలు చర్యలు తీసుకుంటే మార్కెట్‌లో పోటీ అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు. రాయలసీమ ప్రాంతీయ వనరుల కేంద్రంలో ఉన్న 30 రైతు సంఘాలు, సహాయక సంస్థలు, ప్రభుత్వ శాఖలను కలిపి రాబోయే రోజుల్లో ఒక సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆ సమావేశానికి తాను కూడా హాజరవుతానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు అంగడి అవసరం, రైతు సంఘాల బలోపేతం, మార్కెట్ విస్తరణ, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధాన్యతపై వాసన్ సంస్థ ప్రతినిధి ఉత్తప్ప రైతు సంఘాల సభ్యులకు వివరించారు. ఊఆఈఅ ఆూఖీలో ఈఖీఆఖ కార్యక్రమం భాగంగా రైతు సంఘాలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

# ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



అమరావతి, జనవరి 3: మహిళల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని హిందూపురం పట్టణంలోని ఓరియంటల్ మున్సిపల్ హైస్కూల్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, వితంతు పునర్ వివాహాలు, సతీసహగమనంపై సావిత్రిబాయి చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం , సీనియర్ ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్, రామాంజనేయులు, రమేష్ రెడ్డి, నాగప్ప, క్రిష్టప్ప, నరేష్, బాలకృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరికీ మార్గదర్శి

## -కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమాం



శ్రీకాకుళం, జనవరి 3: బాబా సాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు, స్వేచ్ఛను కల్పించిందని, ఆయన ఆలోచనలు నేటి తరానికి నిరంతర మార్గదర్శకాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం ఆముదాలవలస నియోజకవర్గం, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పంచాయతీ పరిధిలోని పఖీర్ సాహెబ్ పేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి కేంద్ర మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. కేవలం విగ్రహాలు ఏర్పాటు చేయడమే కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# టీటీడీ నిధులతో కొండగట్టు ఆలయ అభివృద్ధి

## -గిరి ప్రదక్షణకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
## -రాముడు, అంజన్నల సేవలో తరిస్తా..
## -ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్



జగిత్యాల, జనవరి 3: తనకు పునర్జన్మనిచ్చింది కొండగట్టు అంజన్ననేనని, రాముడు, అంజన్నసేవలో తరిస్తానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ రోజు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తొలుత జేఎన్‌టీయూ హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక హెలికాప్టర్‌లో దిగిన పవన్ కళ్యాణ్‌కు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. హెలిపాడ్ నుండి అంజన్న ఆలయానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ కు కొండగట్టు అంజన్న ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను ఆలయ అర్చకులు ఆశీర్వదించి, స్వామివారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తనకు చిన్ననాటి నుండి స్నేహితుడేనని, ఆయనతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం సంతోష కరమన్నారు. గిరి ప్రదక్షణకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని, కొండగట్టు ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు కేటాయించడం హర్షనీయమని పవన్ కళ్యాణ్ అన్నారు. అనంతరం ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ప్రభుత్వ ఉన్నత అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. శంకు స్థాపన అనంతరం భక్తులకు, అభిమానులకు అభివాదం చేస్తూ జేఎన్టీయూ వద్ద నిర్వహించనున్న పార్టీ కార్యకర్తల సమావేశానికి వెళ్లారు.

# చిరుధాన్యాలతో ఆరోగ్యం

## -ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్
## -కదిరిలో రైతు అంగడి ప్రారంభం

అమరావతి, జనవరి 3: చిరుధాన్యాలతో తయారయ్యే వంటకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. కదిరి పట్టణంలో రాయలసీమ ప్రాంతీయ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు అంగడి కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమం రైతుల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడంలో కీలకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు అంగడిలో అందుబాటులో ఉన్న చిరుధాన్యాలకు సంబంధించిన బియ్యాలు, ఇడ్లీ, ఉప్మా రవ్వలు, వేరుసెనగ విత్తనాలు, నూనెలు, చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, దేశీయ రకాల వరి బియ్యాలను పరిశీలించారు. రైతు సంఘాల ప్రతినిధులతో మాట్లాడి వాటి మార్కెట్ అమ్మకాలు, వినియోగదారుల ఆదరణపై వివరాలు తెలుసుకున్నారు. చిరుధాన్యాలకు కేవలం మార్కెట్ మాత్రమే కాకుండా కుటుంబ స్థాయిలో వినియోగం కూడా పెరగాలని సూచించారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం కలిసి సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

రైతు సంఘాలు కార్పొరేట్ స్థాయిలో ఆలోచిస్తూ ముందుకు సాగడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

వినియోగదారుల కొనుగోళ్లను పెంచేవిధంగా రైతు సంఘాలు చర్యలు తీసుకుంటే మార్కెట్‌లో పోటీ అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపారు.

రాయలసీమ ప్రాంతీయ వనరుల కేంద్రంలో ఉన్న 30 రైతు సంఘాలు, సహాయక సంస్థలు, ప్రభుత్వ శాఖలను కలిపి రాబోయే రోజుల్లో ఒక సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆ సమావేశానికి తాను కూడా హాజరవుతానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రైతు అంగడి అవసరం, రైతు సంఘాల బలోపేతం, మార్కెట్ విస్తరణ, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధాన్యతపై వాసన్ సంస్థ ప్రతినిధి ఉత్తప్ప రైతు సంఘాల సభ్యులకు వివరించారు. HDFC CSR లో FRDP కార్యక్రమం భాగంగా రైతు సంఘాలు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

రెడ్స్ సంస్థకు చెందిన భానుజ మేడం మాట్లాడుతూ కదిరిలో రైతు సంఘాలకు ఒక స్థిరమైన అమ్మకాల కేంద్రం ఉండడం అత్యవసరమని అన్నారు. భవిష్యత్తులో రైతు సంఘాలకు మరింత మద్దతు అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

# భూ రక్షణ కోసమే రీ సర్వే

## -మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి
## -రైతులకు నూతన పాసు పుస్తకాల పంపిణీ

శ్రీ సత్యసాయి బ్యూరో, ఆంధ్రప్రభ : రైతుల భూముల రక్షణ కోసమే ప్రభుత్వం రీ సర్వే నిర్వహించి వారికి ఉన్న భూ హక్కులతో ప్రభుత్వ రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. కొత్త చెరువు మండలం లింగారెడ్డి పల్లిలో ఈ రోజు రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమానికి మాజీ మంత్రి హాజరై మాట్లాడారు. రైతులు ఆస్తి విషయాల్లో ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రీ సర్వే చేయించి ఎవరి భూమి వారికే హక్కు కల్పిస్తున్నారని తెలిపారు.

మన భూమి మన హక్కు కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేస్తోందని తెలిపారు. ఎక్కడ చూసినా ఆస్తి సమస్యలే ఎక్కువగా తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు. ఆస్తి తగాదాలు లేకుండా రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసిన రైతులకు తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. అనంతరం రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజు చేస్తాం..

## -అదే కూటమి పాలన లక్ష్యం..
## -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



నెల్లూరు, జనవరి 3:: రైతు హక్కులను కాపాడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఏఎస్పేట మండలం హసనాపురం గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది.

### రైతు హక్కుల పరిరక్షణ ఎబ గత ప్రభుత్వ ద్రోహం

మంత్రి ఆనం మాట్లాడుతూ, "గత ప్రభుత్వం రైతుల భూములపై వారి హక్కులనే కాలరాసే విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చింది. రైతును కౌలుదారుడిగా మార్చే కుట్రను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి కేబినెట్‌లోనే రద్దు చేసింది" అని ఘాటుగా విమర్శించారు.

### జగన్ బొమ్మల పాలనకు చెక్ – రాజముద్ర పాలనకు శ్రీకారం

గత ప్రభుత్వం ముఖ్యమంత్రి ఫొటోలతో ముద్రించిన పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు ఎలాంటి భద్రతా హక్కులు ఇవ్వలేదని ఆరోపించారు. "జగన్ బొమ్మలతో దొంగ నోటుల్లాంటి పాస్ పుస్తకాలు పంపిణీ చేసి రైతులను మోసం చేశారు. ఇప్పుడు వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో కూడిన భద్రతా పాస్ పుస్తకాలు ఇస్తున్నాం" అని స్పష్టం చేశారు.

### ఎన్నికల ముందు రైతులను మభ్యపెట్టే యత్నం

ఎన్నికలకు కేవలం మూడు నెలల ముందే సుమారు 35 లక్షల రైతుల పాస్ పుస్తకాలను మార్చి రాజకీయ లబ్ధి పొందాలని గత ప్రభుత్వం ప్రయత్నించిందని మంత్రి ఆనం ఆరోపించారు. నెల్లూరు జిల్లాలోనే 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు జగన్ ఫోటోతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని గుర్తు చేశారు.

రైతు కేంద్రంగా పాలన – సీఎం చంద్రబాబు నాయకత్వం

"రైతుకు అన్నం పెట్టే భూమికి రైతునే రాజుగా చేయడమే కూటమి ప్రభుత్వ విధానం. ప్రతి నెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు అన్ని గ్రామాల్లో పాస్ పుస్తకాల పంపిణీ జరుగుతుంది. ప్రతి నెల 9వ తేదీన సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి పాస్ పుస్తకాలు అందజేస్తారు" అని మంత్రి వెల్లడించారు.

### ప్రజాధన దుర్వినియోగంపై తీవ్ర విమర్శ

రీ-సర్వే పేరుతో హద్దురాళ్లపై కూడా జగన్ ఫోటోలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మంత్రి ఆనం తీవ్ర విమర్శలు గుప్పించారు.

ట్రూఅప్ ఛార్జీలకు ముగింపు – కూటమి ప్రభుత్వ నిర్ణయం

గత ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీల భారం మోపగా, కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిగా రద్దు చేసి ప్రజలకు ఊరటనిచ్చిందని మంత్రి స్పష్టం చేశారు.

2026 లక్ష్యం – రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన

2026 డిసెంబర్ నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతులకు అండగా నిలిచేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి ఆనం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతానికి ప్రతీకగా నిలవడంతో పాటు, గత ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై రాజకీయంగా గట్టి సంకేతంగా మారిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# పత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి.. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

కరీంనగర్, జనవరి 3:ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2025 ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ 2025 ను వేగవంతంపై బీఎల్ వోల సమీక్షలో పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రతీ బూత్ పరిధిలో తప్పనిసరిగా ఇంటింటి సర్వే నిర్వహించి 100 శాతం మ్యాపింగ్ చేయాలని సూచించారు.

ఇంటింటి సర్వే సమయంలో ఓటర్ల వివరాలు తీసుకుని జాబితా మ్యాపింగ్ చేయాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితాలో భాగంగా 2025 వ సంవత్సరంలోని ఓటర్లను 2002 ఓటర్ జాబితా లో మ్యాపింగ్ చేయుటకు తక్కువ పురోగతిలో ఉన్న బిఎల్ఓ ల పనితీరును పరిశీలించారు. నియోజక వర్గం పరిధిలోని బూత్ స్థాయి అధికారులు రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఆర్ డీవో బొద్దుల గంగయ్య, పెద్దపల్లి తహసీల్దార్ దండిగ రాజయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు, బీఎల్ వోలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ మునుగోటి రవీందర్

నల్గొండ, జనవరి 3: రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. శనివారం కట్టంగూర్ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు హెల్మెట్లు ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించి వేగ పరిమితులు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో పాటు ఫోన్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమన్నారు. రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలవరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మునాస సత్యనారాయణ, సతీశ్ పాల్గొన్నారు.

# తృణమూల్‌కు ఎంపీ మౌసమ్ నూర్ గుడ్ బై.. కాంగ్రెస్‌లో చేరిక

కోల్‌కతా, జనవరి 3: పశ్చిమ బెంగాల్‌లోని అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ మౌసమ్ నూర్ గుడ్ బై చెప్పారు. శనివారం కాంగ్రెస్ పార్టీలో ఆమె చేరారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు జైరామ్ రమేష్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి గులాం అహ్మద్ మీర్, పీసీసీ అధ్యక్షుడు శుభంకర్ సర్కార్ సమక్షంలో మౌసమ్ నూర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

పార్టీ నేతలు ఆమెను కాంగ్రెస్‌లోకి తిరిగి స్వాగతించారు.

కాగా, 46 ఏళ్ల మౌసమ్ నూర్ 2009 నుంచి 2019 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున మాల్దా స్థానం నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత టీఎంసీలో చేరిన ఆమె రాజ్యసభకు ఎంపికయ్యారు.

మరోవైపు మౌసమ్ నూర్ రాజ్యసభ గడువు ఏప్రిల్‌తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు.

# జిల్లాలో ఈనెల 4న ఆర్టీసీ డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణ

సంగారెడ్డి, జనవరి 03(నేటి నిజం ప్రతినిధి)సంగారెడ్డి జిల్లాలో ఈనెల జనవరి 4న (ఆదివారం) ఆర్టీసీ బస్ డిపోలలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల (ఐ చెక్ అప్) శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు తెలిపారు.

ఈ కంటి పరీక్ష శిబిరాలను జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ మరియు బీహెచ్ఈఎల్ ఆర్టీసీ బస్ డిపోలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ శిబిరాల్లో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు, కంటి వైద్యులు పాల్గొని ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఆర్టీసీ డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు

జిల్లాలోని ఆర్టీసీ డ్రైవర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

# మహిళా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

## –జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
## -సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేర్చాలి
## - టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాష్ రెడ్డి .

సంగారెడ్డి, జనవరి 03 (నేటి నిజం ప్రతినిధి) విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులే రోల్ మోడల్ అని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళాఉపాధ్యాయురాలని, మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, వారి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణ మన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయుల్లో సుమారు 50 శాతం మహిళా ఉపాధ్యాయులే ఉన్నారని, విద్యా వ్యవస్థలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. సావిత్రిబాయి పూలే స్థాపించిన తొలి పాఠశాల వల్లనే నేడు మహిళలు విద్యావంతులై వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. యువతలో వ్యసనాలను రూపుమాపేందుకుఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశం చేయాలనిపిలుపునిచ్చారు.

ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యా యులు కృషి చేయాలని కోరారు.

టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ,మూఢనమ్మకాలు, దురాచారాలు రాజ్యమేలుతున్న కాలంలో ఎన్నో అవమానాలు, కష్టాలను ఎదుర్కొని సమాజ మార్పు కోసం సావిత్రిబాయి పూలే, జ్యోతిబా పూలే కృషి చేశారని అన్నారు. వారి అహర్నిశల సేవల ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు. సమాజాన్ని మార్చిన గొప్ప వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. పిల్లలకు కాలానుగుణంగా మంచి–చెడును బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, మహిళల పట్ల సమాజంలో ఆలోచన ధోరణి మారాలని, సావిత్రిబాయి పూలే ఆశయాలను నెరవేర్చాలని కోరారు.

జిల్లాలో పూలే భవనానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పదిమంది మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి గోవింద్ రామ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీరమ్య యాదవ్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణుగోపాల్, టీజీవో జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ, బీసీ సంఘాల ప్రతినిధులు మల్లికార్జున్ పాటిల్, ప్రభు గౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# జీలకర్ర నీళ్లను రోజూ పరగడుపున తాగితే ఎన్ని అద్భుతమైన లాభాలు



హైదరాబాద్ జనవరి 3: (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మన వంటింట్లో ఉండే మసాలా దినుసుల్లో జీలకర్ర కూడా ఒకటి. భారతీయ వంటకాల్లో జీలకర్ర ముఖ్యపాత్ర పోషిస్తుందని చెప్పవచ్చు. దాదాపు మనం చేసే అన్ని వంటకాల్లో జీలకర్రను వాడుతూ ఉంటాం. వంటలకు చక్కటి రుచి తీసుకు రావడంలో జీలకర్ర పాత్ర ఎంతో ఉంది. జీలకర్రలో ఔషధ గుణాలతో పాటు మన శరీరానికి అవసరమయ్యే పొటాషియం, క్యాల్షియం, సెలీనియం, రాగి, మాంగనీస్ వంటి పోషకాలు కూడా ఎన్నో ఉన్నాయి. జీలకర్రను తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక రకాల అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం కలుగుతుంది. జీలకర్రను ఆహారంలో భాగంగా తీసుకోవడమే కాకుండా జీలకర్ర నీటిని తాగడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుందని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా పరగడుపున ఈ నీటిని తాగడం వల్ల మనం మరిన్ని ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

రక్తహీనతకు చెక్..

జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో జీవక్రియ పెరుగుతుంది. తద్వారా శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరగడంతోపాటు శరీర బరువు కూడా అదుపులో ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల వేగంగా బరువు తగ్గుతారు. జీలకర్ర నీటిని తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తరుచూ ఇన్ఫెక్షన్ ల బారిన పడే వారు జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. రక్తహీనతను తగ్గించడంలో కూడా జీలకర్ర నీరు మనకు సహాయపడుతుంది. జీలకర్రలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. ఐరన్ తక్కువగా ఉన్నవారు, హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నవారు రోజూ జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది.

కొలెస్ట్రాల్ తగ్గేందుకు..

జీలకర్ర జీర్ణ ఎంజైమ్ లను ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీటిని తాగడంవల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అజీర్తి, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. చక్కటి పొట్ట ఆరోగ్యానికి జీలకర్ర నీరు ఎంతో దోహదపడతాయి. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. ట్రైగ్లిజరాయిడ్ స్థాయిలు కూడా తగ్గుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడే వారికి జీలకర్ర నీరు ఎంతో మేలు చేస్తుంది. రక్తపోటుతో బాధపడే వారికి కూడా జీలకర్ర నీరు మేలు చేస్తాయి. జీలకర్ర నీటిలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది.

లివర్, కిడ్నీల ఆరోగ్యానికి..

జీలకర్ర నీరు డిటాక్స్ డ్రింక్ గా కూడా పనిచేస్తాయి. ఈ నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు తొలగిపోతాయి. కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. జీలకర్ర నీటిని తీసుకోవడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. అంతేకాకుండా రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. ఈ విధంగా జీలకర్ర నీరు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ నీటిని ఉదయం పరగడుపున తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇక ఈ నీటిని మనం రెండు విధాలుగా తయారు చేసి తీసుకోవచ్చు. ఒక గ్లాస్ నీటిలో ఒక టీ స్పూన్ జీలకర్ర వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే వడకట్టి తీసుకోవచ్చు. అలాగే ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి బాగా మరిగించి వడకట్టి తాగవచ్చు.

# రికార్డు స్థాయిలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

తిరుపతి, జనవరి 3:ఇటీవల కాలంలో మున్నెన్నడూ లేని విధంగా శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తులు రికార్డుస్థాయిలో స్వామి వారిని దర్శించుకున్నారు. వైకుంఠ ద్వార దర్శనంలో భాగంగా శుక్రవారం నుంచి సాధారణ భక్తులకు దర్శన అవకాశం కల్పించడంతో నిన్న 83,032 మంది భక్తులు దర్శించుకోగా 27,372 మంది తలనీలాలు సమర్పించుకున్నారు.

కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్‌లో నిలబడి దర్శనం చేసుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల శ్రీవారి హుండీకి రూ. 4.10 కోట్లు ఆదాయం వచ్చిందని టీటీడీ అధికారులు వెల్లడించారు. టోకెన్లు లేని భక్తులకు20 గంటల్లో సర్వదర్శనం అవుతుందని తెలిపారు.

# ఆటో డ్రైవర్ల అక్రమ అరెస్టులను ఖండించిన కేటీఆర్

హైదరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్ల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ అంశాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకువస్తామని, అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో డ్రైవర్ల జేఏసీ నేతలను, వేలాది మంది ఆటో డ్రైవర్లను అక్రమంగా అరెస్టు చేయడంపై మండిపడ్డారు .నిన్నటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లను, ఆటో యూనియన్ల నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. వేలాది మంది ఆటో డ్రైవర్లను రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్ స్టేషన్లలో అదుపులోకి తీసుకొని బంధించి ఉంచడం దుర్మార్గమైన చర్యగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నిస్తే, నిర్బంధాలు, అరెస్టులతో గొంతు నొక్కుతున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అరెస్టు చేసిన ఆటో యూనియన్ల నేతలను, ఆటో అన్నలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటనను, ఆటో అన్నలు కోరినట్లుగానే ఈరోజే అసెంబ్లీలో ప్రభుత్వం చేయాలని కేటీఆర్ కోరారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు కొనసాగకుండా ఉండాలంటే, వారికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు "నో హెల్మెట్-నో పెట్రోల్"

## -నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్గొండ, జనవరి 3:జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల ప్రాణాలను కాపాడాలనే ముఖ్య లక్ష్యంతో ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ మాసోత్సవాల ప్రారంభ సందర్భంగా జిల్లా దారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడవడం వల్ల ప్రమాదాలు జరిగి తలకు తీవ్ర గాయాలై అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోటర్ వాహనాల చట్టం 1988 ప్రకారం హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలనే సీటు బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కాబట్టి అటువంటి అలవాట్లకు




పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్ పోస్టర్‌ను ఎస్పీ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్లే జరుగుతున్నాయని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని విద్యా సంస్థలు, బస్‌స్టాండ్లు, ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ఆటో, లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు వెల్లడించారు.

ముఖ్యంగా ద్విచక్ర వాహన ఉద్దేశంతో " నో హెల్మెట్ ? నో పెట్రోల్ " అనే నినాదాన్ని జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ యజమానులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ప్రజల ప్రాణాలు కాపాడుటలో వారి వంతు సహకారంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకే పెట్రోల్ అందించే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు ఎస్పీ తెలిపారు. కావున జిల్లాలోని ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ అందించబడదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

అలాగే ప్రతి వాహనదారుడు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూనే, అవసరమైన చోట కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, అడిషనల్ ఎస్పీ రమేశ్, నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి లావణ్య, ఎస్.బి సీఐ రాము, టూ టౌన్ సీఐ రాఘవరావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, డి.టి.ఆర్బీ రిటైర్డ్ సీఐ అంజయ్య పాల్గొన్నారు.

# ఖాండేవ్ జాతర ప్రారంభం..2.5 కిలోల నువ్వుల నూనె తాగిన ఆడపడుచు

నార్నూర్ , జనవరి 3: పుష్య మాసాన్ని పుష్య పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ లో తోడసం వంశీయులు మహాపూజలతో శ్రీ శ్రీ శ్రీ ఖాండేవ్ జాతర అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం దైవ సన్నిధిలో తైలం సేవించే మహోన్నతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు నలుమూల ప్రాంతాల నుంచి తోడసం వంశస్థులు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఆచారం ప్రకారం ఖాండ గ్రామానికి చెందిన తోడసం దుర్గబాయి-దుర్గ దంపతుల కుమార్తె సర్పంచ్ సాక్రుబాయి 2.5 కిలోల నువ్వుల నూనె తాగింది .

ఈ జాతర 15 రోజులపాటు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు నాగరావ్, ఆలయ చైర్మన్ మేస్రం రూప్ దేవ్, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, సర్పంచ్ బానోత్ కావేరి, రాయి సెంటర్ జిల్లా సార్ మేడి మెస్రం దుర్గుపటేల్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తోడసం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యభద్రతకు అంటువ్యాధుల ముప్పు

## -డాక్టర్ భారత రవీందర్.. సైన్స్ రచయిత & పర్యావరణ నిపుణులు

హైదరాబాద్ డిసెంబర్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నేటి నానోడిజిటల్ యుగంలో మానవుడు అత్యాధునికత పేరుతో ప్రకృతిసాన్నిహిత్యాన్ని మరిచి విధ్వంసక అవిష్కరణలతో పర్యావరణ విధ్వంసానికి పాల్పడుచున్నాడు . పర్యావరణకాలుష్యంతో పాటు అధిక జనసాంద్రత అసాధారణ వాతావరణ మార్పులు అడవుల నరికివేత భూతాపం అపరిశుభ్రత దోమలు ఈగలు పురుగులు తదితర వ్యాధివాహకా లపెరుగుదల వంటి కారణాలు అంటువ్యాధులు ప్రబలడానికి ప్రధానకారణాలని పర్యావరణనిపుణులు హెచ్చరిస్తున్నారు . నేటికి వ్యాధికారక సూక్ష్మజీవులైన బ్యాక్టీరియంలు వైరస్ ల వల్ల కలిగే ప్లేగు మశూచి ఎబోలా నిఫా ఫ్లూ కరోనా వంటి వ్యాధులు మహామ్మారులుగా మారి లక్షలాది జంతువులను మనుషులను కబలిస్తూనే ఉన్నాయి . ఇటీవల బ్రిటన్ లో హెచ్3ఎన్2 ఫ్లూ యూకెలో మంకిఫాక్స్ కాలిఫోర్నియాలో నోరోవైరస్ వల్ల కలిగే వింటర్ ఒమిటింగ్ డిసీజ్ నెదర్లాండ్ లో బర్డ్ ఫ్లూ ఆఫ్రికాప్రాంతాలలో మలేరియా ఆంధ్రప్రదేశ్ లో స్క్రబ్ టైఫన్ కేసులు నమోదు అయినప్పటికీ ప్రాణనష్టం పెద్దగా జరుగలేదు . కానీ ఈ రకమైన అంటువ్యాధులు మానవు నిఆరోగ్యం సామాజికజీవనం ఆర్థికవ్యవస్థలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తాయి . ప్రకృతి విపత్తుల కంటే మహామ్మారులు ఎక్కువ కాలం సమాజాన్ని స్తంభింపచేస్తాయి . కరోనావ్యాధి రాబోయే ఆరోగ్యసవాళ్ళను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామనే అవసరాన్ని వెలుగులోకి తెచ్చింది

అంటువ్యాధుల నివారణ కోసం సంసిద్ధత ప్రతిస్పందన నిర్వహణ మరియు భాగస్వామ్యం యొక్క ప్రాముఖ్యతలను సూచించడానికి ప్రపంచ దేశాలన్నీ ప్రతి ఏడాది డిసెంబర్ 27 నఅంతర్జాతీయ అంటువ్యాధుల సంసిద్ధతా దినోత్సవం ( ఇంటర్నేషనల్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్ నెస్ డే ) ను జరుపుకోవాలని నవంబర్ 2020లో ఐక్యరాజ్యసమితి జనరల్అసెంబ్లీ తీర్మానించింది . ఈ యేడు డిసెంబర్ 27న అన్ని స్థాయిలలో అంటువ్యాధులపై అవగాహన కల్పించడం - అంటువ్యాధుల వ్యాప్తి గురించి సంసిద్ధం చేయడం భవిష్యత్ ఆరోగ్య సవాళ్ళను ఎదుర్కోవడంఅనే ప్రధాన అంశాలతో అరవ అంటువ్యాధుల సంసిద్ధతా దినోత్సవాన్ని జరుపుక ంటునాము . ఈ సందర్భంగా అంటువ్యాధుల నివారణ-నియంత్రణ లక్ష్యంగా 2025 డిసెంబర్ 26-27 తేదిలలో ఇటలిలోని ఫ్లోరెన్స్ లో అంటువ్యాధుల అంతర్జాతీయసదస్సు జరుగుచున్నది . అంటువ్యాధుల నిర్ధారణ-చికిత్స-నియంత్రణలో నూతనదిశలు అనే ఇతివృత్తంతో జూన్ 25-27 తేదిలలో స్పెయిన్ లోని బార్సిలోనాలో జరిగే అంటువ్యాధుల వరల్డ్ కాంగ్రెస్ -2026 లో అంటువ్యాధుల వల్ల సంభవించే భవిష్యత్ సవాళ్ళ గురించి చర్చించనున్నారు .

అంటువ్యాధులు - ఆరోగ్యసవాళ్లు : ప్రాచీన మధ్య యుగాల వరకు కూడా వ్యాధులకు సంబంధించిన ఖచ్చితమైన శాస్త్రీయ పరిజ్ఞానము మానవులకు తెలియకపోవడంతో అనేక ఆరోగ్య ఇబ్బందులను సవాళ్ళను ఎదుర్కొన్నాడు . ఆధునికయుగంలో డచ్ జీవశాస్త్రవేత్త ఆంటోనివాన్ లూవెన్ హాక్ బాక్టీరియాలను రష్యాశాస్త్రవేత్త డిమిత్రి ఇవనోవ్ స్కీ వైరస్ లను కనుగొన్న అనంతరమే సూక్ష్మజీవులు-వ్యాధుల గురించిన శాస్త్రీయసమాచారం ప్రపంచానికి తెలిసింది . సాధారణంగా ఒక పరిమిత ప్రాంతానికి లేదా కమ్యూనిటికి పరిమితమయ్యే అంటువ్యాధిని ఎపిడెమిక్ అని , ఖండాంతర సరిహద్దులు దాటి వ్యాపించే వ్యాధిని మహమ్మారి ( పాండమిక్ ) అని పిలుస్తారు . వ్యాధికారక బాక్టీరియాలు వైరస్ లు జన్యుమ్యుటేషన్ లతో వివిధ హానికర వేరియంట్స్ మహమ్మారులు గా మారి మానవులపై విరుచుకపడి లక్షల మందిని బలిగొన్న సంఘటనలు చరిత్రలో కోకొల్లలు . బాక్టీరియాల వల్ల కలిగే ప్లేగువ్యాధి ఐదుసార్లు మానవజాతిని అతలాకుతలం చేసింది . 5వ శతాబ్దంలో వచ్చిన జస్టీనియన్ ప్లేగు వల్ల ఐరోపా ఆసియా ఉత్తర అమెరికా అరేబియా దేశాల్లో సుమారు మూడుకోట్ల మంది 1347 లో వచ్చిన బుబోనిక్ ప్లేగు వల్ల లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు . 1665 లో కలిగిన ది గ్రేట్ ప్లేగ్ ఆఫ్ లండన్ వల్ల 75 వేల మంది బలైనారు . క్రీ.శ 1817 లో బాక్టీరియాల వల్ల ప్రారంభమైన కలరా కారణంగా రెండులక్షల మందికి పైగా చనిపోయారని అంచనా . 15వ శతాబ్దంలో వైరస్ వల్ల పుట్టి ఐరోపా ఆసియా అరేబియా దేశాల్లో విస్తరించిన మశూచి లేదా గత్తరరోగం వల్ల సుమారు 20 లక్షల మంది చనిపోయారు . టీకామందును కనుగొనడంతో భూమండలం నుండి మశూచి పూర్తిగా తొలగిపోయినట్లు 1980లో డబ్ల్యూహెచ్ఓ ప్రకటించింది . క్రీ.శ 1918 లో వైరస్ వల్ల మొదలైన స్పానిష్ ఫ్లూ మహమ్మారి కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 5 కోట్ల మంది బలి అయినారని చరిత్ర చెబుతోంది .

వైరస్ లు తరచుగా తమ జెనెటిక్ కోడ్ ను మార్చుకుంటూ రేబిస్ ఆంత్రాక్స్ ఎయిడ్స్ డెంగ్యూ స్వైన్ ఫ్లూ బర్డ్ ఫ్లూ చికెన్ గున్యా ఎబోలా జికా హంటా వైరస్ మరియు సార్స్ గా రూపాంతరం చెంది లక్షలాది మందిని బలిగొన్న విషయం విదితమే . ప్రస్తుతం సార్స్ కరోనా వైరస్-2 వల్ల కలిగే కోవిడ్ -19 మహమ్మారి వల్ల ఇప్పటికి ప్రపంచవ్యాప్తంగా 70 లక్షలకు పైగా మరణాలు సంభవించాయి . మన దేశంలో సుమారు 5 లక్షల మందికి పైగా చనిపోయారు . పర్యావరణంలో సానుకూలమార్పులు చోటు చేసుకోకపోతే సమీపకాలంలో మరో ప్రాణాంతక వైరస్ వల్ల కలిగే డిసీజ్- ఎక్స్ ప్రపంచవ్యాప్తంగా కనీసం ఐదుకోట్ల మందిని కబళించే అవకాశాలున్నాయని డబ్ల్యూహెచ్ఓ ఇటీవల హెచ్చరించింది . మరో పదిఏండ్లలో కోవిడ్ -19 లాంటి మరో భీకరమైన వైరస్ పంజా విసిరే అవకాశాలున్నాయని లండన్ కు చెందిన ప్రిడిక్టివ్ హెల్త్ ఇంటలిజెన్స్ డేటా అనలిటిక్స్ సంస్థ ఎయిర్ ఫినిటి తాజాగా ఆందోళన వ్యక్తం చేసింది . విజ్ఞానం సమన్వయము పర్యావరణపరిరక్షణ ప్రజల భాగస్వామ్యం మరియు ఏకీకృత ఆరోగ్య విధానాల అమలు వల్ల ఆరోగ్యసమాజాన్ని నిర్మించవచ్చని ఆరోగ్యనిపుణులు అభిప్రాయపడుతున్నారు .

వన్ నేషన్- వన్ హెల్త్అవశ్యం : ఒక దేశం - ఒక ఆరోగ్యం ( వన్ నేషన్ - వన్ హెల్త్ ) విధానం అనేది మానవుని ఆరోగ్యం జంతువుల ఆరోగ్యం పర్యావరణ ఆరోగ్యం అను మూడు అంశాలు కలిసిన ఒక సమగ్ర జాతీయ ఆరోగ్యభావన . ప్రజలు జంతువులు మొక్కలు మరియు అన్ని పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడం లక్ష్యంగా పెట్టుకున్న సమగ్రమైన ఏకీకృత విధానమునే వన్ హెల్త్ గా సూచిస్తారు . వన్ వరల్డ్ ? వన్ హెల్త్ చొరవలో భాగంగా మన దేశంలో నేషనల్ వన్ హెల్త్ మిషన్ ను ఏర్పాటు చేసి జూనోటిక్ మరియు అంత్రపోజూనోటిక్ వ్యాధుల నియంత్రణకు కృషి సల్పుతున్నది . ఈ విధానం పరిశుభ్రమైన నీరు శక్తి గాలి సురక్షితమైన పోషకాహారం వంటి సామూహిక అవసరాలను పరిష్కరిస్తున్నది . ప్రజలకు ఆయుష్మాన్ భారత్ ద్వార ఆరోగ్యభద్రతను అందిస్తున్నది.

# ఇదే కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్‌కు ఉన్న తేడా.. ఉత్తమ్‌పై హరీశ్‌రావు ధ్వజం


హైదరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా అని నిలదీశారు. "అసెంబ్లీలో ఆడియో -విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోము." అని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్ కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పు గా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# సమాజ హితానికి పరిశోధనలు దోహదం చేయాలి : డీఈఓ భిక్షపతి

## -నల్లగొండ జిల్లాలో ముగిసిన జిల్లా సైన్స్ ఫెయిర్
## -రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఇన్‌స్పైర్ 11 ప్రాజెక్టులు
## - జూనియర్, సీనియర్ విభాగంలో 14 ప్రాజెక్టులు
## -విజేతలకు బహుమతులు అందచేసిన డీఈఓ, జిల్లా సైన్స్ అధికారి

నల్గొండ, జనవరి 3: సమాజ హితానికి పరిశోధనలు దోహదం చేయాలని నల్లగొండ డీఈఓ భిక్షపతి అన్నారు. జిల్లా సైన్స్ ఫెయిర్ ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల ప్రదర్శన శనివారం విజయవంతంగా ముగిసింది. జిల్లా నుండి ఇన్‌స్పైర్ 11 ప్రాజెక్టులు, సైన్స్ ప్రదర్శనలో జూనియర్ 7, సీనియర్‌లో 7, టీచర్ ఎగ్జిబిట్‌లో ఆర్.నరస్వతి, జిహెచ్ఎం పుల్లెంల, సెమినార్‌లో జి.వినీలా జడ్పీహెచ్ఎస్ నకిరేకల్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ముగింపు వేడుకకు డీఈఓ బొల్లారం భిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి హాజరై విజేతలకు బహుమతులు అందచేశారు. రాష్ట్ర స్థాయి ఎంపికైన ప్రాజెక్టులు ఈ నెల 7 నుండి 9 వరకు కామారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు వెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల విద్యార్థులు, గైడ్ టీచర్స్ పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని గానీ లేదా 98485 78845 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముగింపు సభలో జిల్లా పోలీసు కళాజాత, జిల్లా బాలభవన్ మాస్టర్ బాలు శిష్యులు, వివిధ పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి



కొమ్ము శ్రీనివాస్, ఎంఈఓలు బాలాజీనాయక్, అంజయ్య, అరుంధతి, జిల్లా గణిత ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి సునీల్, కొరివి కృష్ణ, ప్రభుత్వ బీఈడీ కళాశాల అధ్యాపకులు, బీఈడీ శిక్షణ విద్యార్థులు, సిబ్బంది, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులకు కలెక్టర్ అభినందన

ప్రభుత్వ బీఈడీ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలలో ఎగ్జిబిట్స్ ప్రదర్శించిన గదులతో పాటు ప్రదర్శనకు వచ్చే ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రభుత్వ బీఈడీ కళాశాల, బీఈడీ శిక్షణ విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. ఉపాధ్యాయ విద్యార్థి అంటేనే అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించాల్సి ఉంటుందని ఆ విషయం శిక్షణలోనే తెలుసుకోవడం అభినందనీయమన్నారు.

# 'విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి'

## – కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్

నల్గొండ, జనవరి 3:విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ అన్నారు. శనివారం కట్టంగూర్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు సరిపడా వసతులను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు క్రమశిక్షణతో విని ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు.

# ఆటో యూనియన్ నాయకుల ముందస్తు అరెస్టు



రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జనవరి 3న చలో అసెంబ్లీ కార్యక్రమానికి ఆటో జేఏసీ పిలుపునివ్వగా, వేములవాడ ఆటో యూనియన్ నాయకులు సయ్యద్ ఉమర్, సుంకపాక దేవరాజు, ఏంఏ అంజద్ పాషా, ఎండి అబ్జల్ పాషా (వకీల్), గుడిసె వాసు, షేక్ రఫీక్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నాయకులు ప్రభుత్వానికి అనేక డిమాండ్లు చేస్తున్నారు. వాటిలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సాయం, ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ర్యాపిడో బైక్స్‌ను నిషేధించడం వంటివి ఉన్నాయి.

# సైబర్ క్రైం నివారణకు ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

## – వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం




రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలంలోని వట్టెల, ఫాజుల్ నగర్, తుర్కాషినగర్, నమిలిగుండుపల్లి, నూకలమర్రి, చెక్కపల్లి, ఎదురుగట్ల గ్రామాలలో వ్యాపార సంస్థలు, బస్టాండ్ కూడళ్ళు, పాఠశాలలు, షాపింగ్ మాల్స్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సైబర్ క్రైం నివారణపై పోస్టర్లను అంటించారు. ఈ సందర్భంగా వేములవాడ రూరల్ ఎస్ఐ వెంకట్రాజం మాట్లాడుతూ ఏపీకే ఫైల్స్ స్కామ్ ప్రస్తుతం అధికంగా జరుగుతుందని, ఎవరు కూడా ఏపీకే ఫైల్స్ ఇన్స్టాల్ చేసుకోవద్దు అని ఆన్‌లైన్ మోసాలు, ఫోన్ కాల్స్ ద్వారా జరిగే మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ దుర్వినియోగం వంటి వాటిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింకులపై క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత వివరాలు ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వెల్లడించారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు




రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): లింగంపేట మహోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ ఏనుగుల కృష్ణ ఆధ్వర్యంలో భారత దేశపు తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ మహిళ ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుందని, సావిత్రిబాయి మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని నయాగావ్ జిల్లాలోని జనవరి 3న 1831 లో జన్మించారు. 9 సంవత్సరాల వయసులోనే 13 సంవత్సరాల జ్యోతిరావు పూలే తో వివాహం జరిగిందన్నారు. 1848లో జ్యోతిరావు పూలే తో కలిసి పూణేలో బాలికల కోసం మొట్టమొదటిసారి పాఠశాలను ప్రారంభించారన్నారు. స్త్రీల విద్య కొరకు దళితుల హక్కుల కొరకు కుల వ్యతిరేక పోరాటం చేశారని, సావిత్రిబాయి స్ఫూర్తితోనే మహిళలు ముందుండి అన్ని కార్యక్రమాలలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుంల్లుఏనుగుల రేణుక, కాముటం స్వప్న, మెంగలి కవిత,పాహిమా బేగం, మున్నీర ఉన్నారు.

# అన్వేష్ మీద దేశ ద్రోహం కేసు నమోదు చేయాలి: రాజు నేత



హైద్వేరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హిందూ దేవి దేవతలను కించపరిచేలా హిందూ దేవాలయాలను కూలగొట్టాలని హిందూ మతాన్ని నాశనం చేయాలని మాట్లాడిన యూట్యూబర్ నా అన్వేషణ అవినాష్ పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని , కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో తెలంగాణ ఉద్యమకారుడు బిజెపి రాష్ట్ర నాయకులు రాజు నేత పిర్యాదు చేసారు. అనంతరం రాజు నేత మాట్లాడుతూ ఇలాంటి దేశ ద్రోహులు 100 కోట్ల మందికి పైగా ఉన్న హిందువుల మనోభావాలను కించపరిచేలా, రెచ్చగొట్టేలా హిందువులంతా దొంగలని హిందువులు రేపిస్టులని మాట్లాడుతూ పబ్బం గడుపుతున్నాడని... విదేశాలలో ఉంటూ మన దేశ గడ్డ మీద పుట్టి పెరిగి మన దేశపు సొమ్ము తింటూ అబద్దాలను ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని కచ్చితంగా తగిన రీతిలో సమాధానం ఉంటుందని అన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎనుగంటి రాజు నేత, హైకోర్టు అడ్వకేట్ రాము, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మణికంత, బొమ్మరాసపల్లి సర్పంచ్ చెరుకు తిరుపతమ్మ, వెంకటయ్య, జగన్ చారి ఉన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు

రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నీరజకు వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో కార్యవర్గం శనివారం శాలువాతో సన్మానించి, 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ 2026 నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరు ఆయురారోగ్యాలతో, ఆనందోత్సవాల మధ్య జీవితం గడపాలని కోరారు. వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయిలకి సైతం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి, గడ్డం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు, కటకం జనార్ధన్, కోళ్ల శ్రీనివాస్, గుజ్జే మనోహర్కనికరపు శ్రీనివాస్, సాగరం శ్రీధర్,తమిరి అన్నపూర్ణ, మొగిలి సుజాత, పాల్గొన్నారు.

# మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారు

## -ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన

### -డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్

హైదరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కానీ ఎంతో చరిత్ర ఉన్న సికింద్రాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు విభజిస్తున్నారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. టెక్నికల్ స్టడీ లేకుండానే ప్రాంతాలను విభజిస్తున్నారని అన్నారు. జంట నగరాల ఉనికి లేకుండా కుట్ర చేస్తున్నారని తలసాని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడమని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. మహానగర విభజన పై కాంగ్రెస్ నాయకులకు కనీసం అవగాహన లేదని తలసాని విమర్శించారు. డివిజన్లను కూడా సరిగా విభజించలేదని అన్నారు. 24 నియోజకవర్గాలు ఉన్న మహానగరాన్ని విభజిస్తున్నప్పుడు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోలేదని తెలిపారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం బిఆర్ఎస్ హయాంలో 150 డివిజన్లు చేశామని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహానగరాన్ని ఇష్టమొచ్చినట్లు విభజిస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పనుల కోసం ప్రజలు నగరం మొత్తం తిరిగే పరిస్థితి తీసుకొస్తున్నారని తెలిపారు. దీనిపై చట్టపరంగా, న్యాయపరంగా పోరాడతామని తెలిపారు. అసెంబ్లీలో కూడా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

ఎంతోమంది ముఖ్యమంత్రులను, స్పీకర్లను చూశాం.. కానీ ఇలాంటి ముఖ్యమంత్రి, స్పీకర్‌ను చూడలేదని అన్నారు. స్పీకర్ కనీసం ప్రతిపక్ష సభ్యుల వైపు చూడటం లేదని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడడం ప్రతిపక్ష పార్టీ పని అని.. కానీ ప్రతిపక్ష పార్టీని స్పీకర్ నిలువరిస్తున్నారని అన్నారు. గంటన్నర పాటు రేవంత్ రెడ్డి బూతు పురాణం మాట్లాడుతున్న స్పీకర్ అడ్డు చెప్పలేదని మండిపడ్డారు. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా వత్తాసు పలికేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మాటలకు చేతలకు పొంతనలేదని విమర్శించారు. అందరి అభిప్రాయాలు తీసుకుంటామని చెబుతూనే అభిప్రాయం చెప్పకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.

# మహిళా విద్యకు మార్గదర్శకురాలు.. రాయపోల్‌లో ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి

మెదక్, జనవరి 3:మహిళా విద్యకు మార్గదర్శకురాలిగా, సమాజ సంస్కర్తగా చిరస్థాయిగా నిలిచిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని రాయపోల్ ప్రెస్ అధ్యక్షుడు పుట్ట రాజు,దాతర్ పల్లి భాస్కర్ అన్నారు. శనివారం రాయపోల్ మండల దళిత బహుజన సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్షరజ్ఞానం లేని మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన మహానీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. కుల, మత, లింగ భేదాలను త్రోసిపుచ్చి సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం నేటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బాలికల విద్యే సమాజ అభివృద్ధికి పునాది అనే భావనను ఆచరణలో చూపి న గొప్ప సంస్కర్తగా ఆమె చరిత్ర లో నిలిచిపోయారని తెలిపారు.

మనుధర్మ శాస్త్ర ప్రకారం మహిళలు చదువుకునే అవకాశం లేదు. ఎన్నో నిర్బంధాలు, అవమానాలు, దాడులు అణిచివేతను ఎదుర్కొని తన భర్త జ్యోతిరావు పూలే సహాయంతో విద్యాబుద్ధులు నేర్చుకొని దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా ఎంతోమంది బడుగు బలహీన వర్గాల మహిళలకు చదువు నేర్పించా రు.

# రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి : ఎస్ఐ మునుగోటి రవీందర్

నల్గొండ, జనవరి 3:రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులు అవగాహన కలిగి ఉండాలని కట్టంగూర్ ఎస్ఐ మునుగోటి రవీందర్ అన్నారు. శనివారం కట్టంగూర్ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు హెల్మెట్లు ధరించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు, సీట్ బెల్టులు ధరించి వేగ పరిమితులు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో పాటు ఫోన్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమన్నారు. రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మునాస సత్యనారాయణ, సతీశ్ పాల్గొన్నారు.

# డగ్స్ తీసుకుంటూ ఈగల్ టీం కు చిక్కిన జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు

హైదరాబాద్ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్.. ఇప్పటివరకూ ఎన్నో డ్రగ్స్ రాకెట్లను చేధించింది. ఎంతో మందిని డ్రగ్స్ కేసులో అరెస్ట్ చేసింది. తాజాగా డ్రగ్స్ కేసులో ఎమ్మెల్యే కుమారుడిని అరెస్ట్ చేసింది. ఈగల్ టీం. డగ్స్ తీసుకుంటూ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు పోలీసులకు చిక్కాడు. హైదరాబాద్ నార్సింగిలో జరిగిన తనిఖీల్లో ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డి పోలీసులకు దొరికిపోయాడు. సుధీర్ రెడ్డికి డ్రగ్స్ టెస్ట్ నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలింది. దీంతో సుధీర్‌ని అరెస్ట్ చేసిన పోలీసులు అతడిని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించారు. అతడితో పాటు మరొకరు కూడా పోలీసులకు చిక్కాడు. గతంలో రెండుసార్లు డ్రగ్స్ తీసుకుంటూ సుధీర్ దొరికిపోవడం గమనార్హం.

# ఆరేళ్ల చిన్నారిపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం..హత్య

లక్నో జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆరేళ్ల చిన్నారిపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం చేసిన సంఘటన ఉత్తర్ ప్రదేశ్ లోని బులందర్ షహర్ లో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చిన్నారి ఇంటి దాబా పై ఆడుకునేందుకు వెళ్లగా వారి ఇంటిపై అద్దెకుండే రాజ్, కశ్యప్ చిన్నారిపై అత్యాచారం చేసి ఆపై దాబాపై నుంచి తోసేశారు. ఈ ఘటనలో చిన్నారి తీవ్రంగా గాయ పడింది. అది గమనిం చిన స్థానికులు చికిత్స నిమిత్తం బాలికను ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో మరణిం చింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనస్థలికి చేరుకున్న పో లీసులు వివరాలు అడిగి తెలుసు కున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందు తుల కోసం వెతకగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో ఉన్నట్లు తెలిసి ంది. అక్కడకు వెళ్లిన పోలీసులపై నిందుతులు కాల్పులు జరిపారు. పోలీసులు జరిపిన ఎదురు కా ల్పుల్లో నిందితులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

# బహుజన సేన ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు





రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): బహుజన సేన రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన సేన జిల్లా అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ, సావిత్రిబాయి పూలే మహిళా విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. కుల, లింగ వివక్షల మధ్య మహిళలకు విద్య అందించేందుకు ఆమె చేసిన పోరాటం నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆమె జీవిత చరిత్రను తెలుసుకుని స్ఫూర్తి పొందాలని అన్నారు. అలాగే విద్యనే సమాజాన్ని ముందుకు నడిపించే ప్రధాన ఆయుధమని, సావిత్రిబాయి పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో అమలు చేయాలని పిలుపునిచ్చారు. వేములవాడ పట్టణంలో పూలే దంపతుల స్ఫూర్తిని అందించడం కోసం మహాత్మ జ్యోతిరావు పూలే మరియు సావిత్రి పూలేల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పి.రాజరత్నం, ఉపాధ్యాయులు మల్లేశం, హమీద్ పిడి, గుడిసె మనోజ్ కుమార్, జింక శ్రీకాంత్, మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి

## -జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

### మైనారిటీ వెల్ఫేర్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి



రాజన్న సిరిసిల్ల,జనవరి 3:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ మైనారిటీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో మొట్టమొదటి ఆదర్శ మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలని, విద్యాభివృద్ధి కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన ఆదర్శ మహిళ అని అన్నారు. సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని, కష్టాలను ఎదుర్కొని తట్టుకొని ముందుకు సాగాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి కవిత, జిల్లా లీగల్ ఆఫీసర్ అంజయ్య, జెండర్ స్పెషలిస్ట్ దేవిక, ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

# వీఐపీ, వీవీఐపీ లు తప్పనిసరిగా దర్శనం టికెట్లు కొనుగోలు చేయాల్సిందే..

## – ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయం అధికారులు కీలక నిర్ణయం

విజయవాడ జనవరి 3 (ఎక్స్ ప్రెస్ . న్యూస్ );విజయవాడలోని ఇంద్రకీలాద్రి దుర్గమ్మ ఆలయం అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు వచ్చే వారు సైతం తప్పనిసరిగా దర్శనం టికెట్లు కొనుగోలు చేయాల్సిందేనని నిర్ణయించారు. అమ్మవారి హుండీ ఆదాయాన్ని, ఆలయ నిర్వహణ నిధులను పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త నిబంధన తీసుకొచ్చినట్లుగా అధికారులు తెలిపారు. సాధారణ రోజుల్లో సుమారు 30 వేల మంది ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుంటున్నారు. అదే వీకెండ్ (శుక్ర, శని, ఆదివారాలు)లో 50 వేల వరకు భక్తులు వస్తున్నారు. అయితే ఇందులో 200 నుంచి 300 మంది వరకు వీఐపీ, వీవీఐపీ సిఫారసు లేఖలతో ఆలయానికి వస్తున్నారు. వారు టికెట్ కొనకుండానే దర్శనం చేసుకుం టున్నట్లు ఆలయ ఈవో శీనా నాయక్ దృష్టికి వచ్చింది. మరి కొంతమంది ప్రొటోకాల్ పేరుతో టికెట్ లేకుండానే దర్శనాలు చేసుకుంటారని కూడా తెలిసింది. దీనివల్ల ఆలయ ఆదాయానికి గండి పడుతుందని ఆలయ అధికారులు భావించారు. దీనికి అడ్డుకట్ట వేయాలని ధర్మకర్తల మండలి సమావేశంలో చర్చిం చారు. ఈ క్రమంలోనే వీఐపీ, వీవీఐపీ దర్శనం చేసుకునే వారు సైతం టికెట్లు కొనుగోలు తప్ప నిసరి చేస్తూ నిర్ణయం తీసుకు న్నారు. ఈ మేరకు సిఫారసు లేఖలతో వచ్చే ప్రతి ఒక్కరూ టికెట్ కొనాల్సిందేనని ఆదేశాలు జారీ చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com